**విలేకరులు కావలెను**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో తొవ్వ దినపత్రిక లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

జిల్లా బ్యూరో చీఫ్‌లు | జిల్లా స్టాఫ్ రిపోర్టర్‌లు

నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు | మండల రిపోర్టర్‌లు

సంప్రదించవలసిన ఫోన్ నెంబరు :

8328649322, 9398236146.



# తొవ్వ


సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 | సంచిక : 313 | మంగళవారం 17-06-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 2 | వెల : 5 రూ/.


## రేవంత్ పాలనలో వైద్య కళాశాలల భవితవ్యం ప్రశ్నార్థకం

### మాజీ మంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్, జూన్ 16:** బీఆర్ఎస్ హయాంలో ఎంతో ముందుచూపుతో ప్రారంభించిన ప్రభుత్వ వైద్య కళాశాలల భవితవ్యం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రశ్నార్థకంగా మారిందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సోమవారం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. రాష్ట్రంలోని 26 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సౌకర్యాలు, వసతులు నిబంధనల ప్రకారం లేవని పేర్కొంటూ.. ఈనెల 18న హెల్త్ సెక్రటరీ, డీఎంఈ ఇద్దరూ జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) ముందు ప్రత్యక్షంగా హాజరుకావాలని ఆదేశాలివ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ చేతగాని తనానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పరిపాలనా వైఫల్యం వైద్య విద్యార్థులకు శాపంగా మారుతోందని విమర్శించారు. సీఎం రేవంత్ ఇప్పుడు మేల్కొని దానిపై కమిటీ వేయడం హాస్యాస్పదమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలనను గాలికొదిలేసి ప్రతీకార రాజకీయాలు చేస్తున్నారని పేర్కొన్నారు. వందలాది వైద్య విద్యార్థుల భవిష్యత్తుకు ఎవరు భరోసానిస్తారో చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.



- 70 లక్షల మంది ఖాతాల్లో రైతు భరోసా సొమ్ములు
- ఏడాదిన్నరలో రైతుల కోసం లక్ష కోట్లు వెచ్చించాం
- సన్నవడ్ల సాగుతోనే పేదలకు సన్నబియ్యం
- అన్నదాతలు అంబానీ, అదానీలతో పోటీపడాలి
- రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందిస్తాం
- బీఆర్ఎస్ పదేళ్లలో వందేళ్ల ఆర్థిక విధ్వంసం
- కొత్తగా వచ్చినోడికి కొంత టైం ఇద్దామని లేదు
- ఏం జరిగినా ప్రతిపక్షానికి పైశాచిక ఆనందమే
- వాళ్లు రోడ్లపై దొర్లినా పదేళ్లు మేమే ఉంటాం
- రైతువేదికల ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి
- వానాకాలం 'రైతుభరోసా'ను ప్రారంభించిన సీఎం

# 9 రోజుల్లో 9 వేల కోట్లు!

**హైదరాబాద్, జూన్ 16:** రాష్ట్రంలోని రైతులకు ఏకకాలంలో రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. వానాకాలం సీజన్‌లో పంటలకు పెట్టుబడి ఖర్చుల కోసం అన్నదాతలు ఎవరి దగ్గరా చేయిచాచి, అప్పు అడగకుండా చూడాలన్నదే తమ ఉద్దేశమని తెలిపారు. అందుకే రైతు భరోసాను ఏకకాలంలో అమలు చేయాలని నిర్ణయించామన్నారు. సోమవారం నుంచి రాబోయే 9 రోజుల్లో రూ.9 వేల కోట్లను రైతుల ఖాతాలకు బదిలీ చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 70,11,184 మంది రైతులకు ఎకరానికి రూ.6 వేల చొప్పున 1.49 కోట్ల ఎకరాలకు రైతు భరోసా చెల్లిస్తామని చెప్పారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన రైతువేదికల ప్రారంభోత్సవ కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 566 రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం ఉంది. మరో 1,034 రైతువేదికల్లో వీసీ సౌకర్యం కల్పించే కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,600 రైతువేదికల్లో ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షప్రసారం చేశారు. ఇదే వేదిక నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వానాకాలం రైతుభరోసా నగదు బదిలీ కార్యక్రమాన్ని మీట నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఎగ్గొట్టిన పెట్టుబడి సాయం, కనీస మద్దతు ధర, బోనస్, రైతుబీమా అన్నీ కలిపి ఇప్పటి వరకు 18 నెలల్లోనే ఈ ప్రభుత్వం రైతుల కోసం రూ.1,01,728 కోట్లు ఖర్చు పెట్టిందని చెప్పారు. గత ప్రభుత్వంలోని పెద్దలు ప్రాజెక్టుల పేరుతో లక్ష కోట్లు దోచుకుంటే.. ఈ ప్రభుత్వం ఏడాదిన్నరలోనే లక్ష కోట్లు రైతులకు పంచిపెట్టిందని తెలిపారు. పదేళ్లలో వందేళ్ల విధ్వంసం జరిగిందని, ఆర్థిక విధ్వంసాన్ని సరిచేయడానికి రోజుకు 18 గంటలు పనిచేస్తున్నామని రేవంత్‌రెడ్డి చెప్పారు. రాజకీయాల్లోకి ఎవరొచ్చినా రైతుల అండదండలు లేకుంటే ఏమీ చేయలేరన్నారు. వార్డు సభ్యుడు, సర్పంచి, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీ, చివరకు ముఖ్యమంత్రి కావాలన్నా రైతుల ఆశీర్వాదం ఉంటేనే సాధ్యపడుతుందని రేవంత్‌రెడ్డి అన్నారు. అప్పుడే పది కాలాలపాటు కుర్చీ పదిలంగా ఉంటుందని చెప్పారు. ఉమ్మడి ఏపీలో, గత పదేళ్లలో అధికారంలో ఉండి ఏమీ చేయనివారు ఇప్పుడు వీధి నాటకాలు ఆడుతూ విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పదేళ్ల పాలనలో ప్రజల నెత్తిమీద అప్పు, రైతుల చేతిలో చిప్ప పెట్టడం తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు రుణమాఫీ, ఉద్యోగులకు పదవీ విరమణ సొమ్ము, మొదటి తారీఖున వేతనాలు ఇవ్వలేని పరిస్థితుల్లోకి రాష్ట్రాన్ని తీసుకొచ్చారని ఆరోపించారు. రెండుసార్లు అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని దోచుకున్నారని దుయ్యబట్టారు. 2018 నుంచి 2023 వరకు రూ.11,500 కోట్ల రుణమాఫీ చేస్తే.. రూ.8,500 కోట్లు వడ్డీలకే పోయిందని, కేవలం రూ.3 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ అయ్యిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసిందని తెలిపారు. వరి వేస్తే ఉరి వేసుకున్నట్లేనని గత ప్రభుత్వం చెప్పిందని.. తమ ప్రభుత్వం మాత్రం కనీస మద్దతు ధరతోపాటు సన్నాలకు రూ.500 బోనస్ ఇచ్చి ధాన్యం కొనుగోలు చేసి, 48 గంటల్లో డబ్బులు చెల్లిస్తోందని గుర్తుచేశారు. రైతులకు వరి సాగు చేయొద్దని చెప్పి, వాళ్లు మాత్రం ఫాంహౌసలో 150 ఎకరాలు సాగు చేసి క్వింటా రూ.4,200 చొప్పున ధాన్యం అమ్ముకున్నారని తెలిపారు. రైతులు సన్నవడ్లు పండించడంతోనే పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయగలుగుతున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. ఏడాదిలో 2.80 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి చేయడంలో, సన్నాలు సాగు చేయడంలో దేశంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని చెప్పారు. రైతుల కళ్లల్లో ఆనందం చూస్తున్నామని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా తనకు ఇంతకంటే సాధించే విజయం ఏమీ లేదని అన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకునే రోజుల నుంచి ఆత్మగౌరవంతో బతికే రోజులు తీసుకొచ్చామని తెలిపారు. రైతుల పిల్లలు ఉన్నత విద్యలు చదివి ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లుగా స్థిరపడితే దేశంలో ఎక్కడున్నా సొంత ప్రాంతానికి మేలు చేస్తారని రేవంత్‌రెడ్డి చెప్పారు. బిల్లులు రాలేదని మాజీ సర్పంచులు ఆందోళనలు చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అ?ధికారంలోకి రాకముందు చేసిన పనులకు, మంజూరు కాని బిల్లులకు ఇప్పుడు తమను నిందిస్తున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కాంట్రాక్టర్ల బిల్లులు, ఉచిత విద్యుత్తు బకాయిలన్నీ కలిపి రూ.8.29 లక్షల కోట్లు అప్పు చేసి పోయారని తెలిపారు.

## బనకచర్లకు పర్యావరణ అనుమతి ఇవ్వొద్దు

### పోలవరం విస్తరణ గోదావరి ట్రైబ్యునల్ తీర్పునకు విరుద్ధం

### కేంద్రానికి మంత్రి ఉత్తమ్ లేఖ



**హైదరాబాద్, జూన్ 16:** పోలవరం-బనకచర్ల అనుసంధానం కోసం చేపట్టిన ప్రాజెక్టుకు ఎట్టి పరిస్థితుల్లో పర్యావరణ అనుమతి ఇవ్వరాదని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని తెలంగాణ కోరింది. ఈ మేరకు నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌కు సోమవారం లేఖ రాశారు. మంగళవారం గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతికి అవసరమైన విధి విధానాల(టీవోఆర్)పై చర్చించేందుకు కేంద్ర అటవీ పర్యావరణ శాఖ నిపుణుల కమిటీ సమావేశం జరగనుంది. ఈ సమావేశం అజెండాలో పోలవరం-బనకచర్ల (గోదావరి-బనకచర్ల అనుసంధానం) ప్రాజెక్టు ఉండటంతో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. 200 టీఎంసీల సామర్థ్యంతో ఏపీ చేపట్టదలిచిన పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు గోదావరి ట్రైబ్యునల్-1980 తీర్పునకు విరుద్ధమని, ఈ ప్రాజెక్టు చేపట్టే అధికారం ఏపీకి లేదని ఉత్తమ్ తన లేఖలో పేర్కొన్నారు. గోదావరి నదిపై తెలంగాణ హక్కులను కాలరాసేలా ఉన్న ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలను పరిశీలించడానికి కూడా వీల్లేదని గతంలో తాము లేఖలు రాయగా.. బచావత్ ట్రైబ్యునల్ తీర్పుకు అనుగుణంగానే వ్యవహరిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని ఉత్తమ్ తెలిపారు. వరద నీటి పేరుతో గోదావరి జలాలను అక్రమంగా తరలించడానికి నిర్ణయం తీసుకున్నారని, వరద జలాలపై ఏపీకి హక్కులు లేవని పేర్కొన్నారు. గోదావరిలోనే కాకుండా కృష్ణాలోనూ ట్రైబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా ఏపీ నిర్ణయాలు ఉంటున్నాయన్నారు. 'పోలవరంతో ముడిపడిన పర్యావరణ అంశాలను ప్రభావిత రాష్ట్రాలతో సమావేశమై పరిష్కరించాలని 2022 సెప్టెంబరు 6న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. నాలుగుసార్లు సమావేశాలు జరిగినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ నేపథ్యంలో కొత్తగా పోలవరం విస్తరణకు అనుమతిపై నిపుణుల మదింపు కమిటీ సమావేశం జరగడం అభ్యంతరకరమ'ని స్పష్టం చేశారు. కాగా, నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా కూడా కేంద్ర పర్యావరణ శాఖ కార్యదర్శికి మరో లేఖ రాశారు.

## రాజాసింగ్‌లా సీనియర్ నాయకుడిని కాదు!

### నేను సాధారణ కార్యకర్తనే.. సీనియర్లు మాట్లాడినప్పుడు మేం తప్పకుండా వింటాం

### రాజాసింగ్‌పై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యంగ్యాస్త్రాలు



**హైదరాబాద్,జూన్ 16:** తాను సాధారణ కార్యకర్తనని, ఎమ్మెల్యే రాజాసింగ్ సీనియర్ నాయకుడని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సెటైర్ వేశారు. ఇటీవల రాజాసింగ్ బీజేపీలోని కొంతమంది సీనియర్ నాయకులపై తీవ్ర విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. పార్టీ నాయకత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో విలేకరులు అడిగిన ప్రశ్నకు కిషన్‌రెడ్డి స్పందించారు. రాజాసింగ్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధి మాట్లాడినప్పుడు తప్పకుండా వింటాం. వారి మాటలను గౌరవించి చర్చిస్తాం. వారంతా పార్టీ కోసం త్యాగాలు చేసిన వాళ్లు. మేమంతా సాధారణ కార్యకర్తలం" అని అన్నారు. బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ ప్రజల హక్కులు కాపాడేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై కేంద్ర జలవనరుల శాఖ మంత్రికి సీఎం లేఖ రాయాలని కోరారు. కేంద్ర జలశక్తి మంత్రితో కలిసి ఏపీ సీఎం చంద్రబాబుతో చర్చలు జరపాలని విజ్ఞప్తి చేశారు. వివాద పరిష్కారం కోసం రెండు రాష్ట్రాల మధ్య చర్చలు జరగాలని, ఇదే తమ వైఖరి అని తెలిపారు.

## ఖాజాగూడలో ప్రభుత్వ భూమి కబ్జాపై..

### నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల పిల్

- చెరువు ఎఫ్‌టీఎల్ 27.18 ఎకరాల్లో 47 అంతస్తుల చొప్పున 8 టవర్లు నిర్మిస్తున్నారన్న ఎమ్మెల్యేలు
- భూమి విలువ రూ.10 వేల కోట్లు ఉంటుంది
- హైడ్రాకు ఫిర్యాదు చేసినా లాభం లేదని తెలిపిన అనిరుధ్ రెడ్డి, యెన్నం, మురళీనాయక్, రాజేశ్ రెడ్డి
- అధికారులు కుమ్మక్కయ్యారని తీవ్ర ఆరోపణ
- హైడ్రాకు ఇచ్చిన ఫిర్యాదులో సర్వే నంబర్, లొకేషన్ ఎందుకు పేర్కొనలేదన్న హైకోర్టు
- పూర్తి వివరాలతో మళ్లీ ఫిర్యాదు చేయాలని, ఆ కాపీ సమర్పించాలని ఎమ్మెల్యేలకు సూచన
- విచారణ రెండు వారాల పాటు వాయిదా



**హైదరాబాద్, జూన్ 16:** కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ ప్రభుత్వం, అధికారులకు వ్యతిరేకంగా నలుగురు అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు. ఖాజాగూడ చెరువు ఫుల్ ట్యాంక్ లెవెల్ పరిధిలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా భారీ టవర్లు నిర్మిస్తున్నారని పేర్కొంటూ ఎమ్మెల్యేలు జనంపల్లి అనిరుధ్ రెడ్డి (జడ్చర్ల), యెన్నం శ్రీనివాసరెడ్డి (మహబూబ్ నగర్), మురళీనాయక్ భూక్యా (మహబూబాబాద్), కూచుకుల్ల రాజేశ్ రెడ్డి (నాగర్‌కర్నూల్) పిల్ దాఖలు చేశారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడ గ్రామ పరిధిలోని పాత సర్వే నెంబర్లు 119, 122, కొత్త సర్వే నెంబరు 27లోని 27.18 ఎకరాల ప్రభుత్వ భూమిలో బెవర్లీ హిల్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, బండి బిందు నుంచి డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కం జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (డీఏజీపీఏ) పొందిన బీ సుబ్బారెడ్డి 47 అంతస్తుల చొప్పున 8 భారీ టవర్లు నిర్మిస్తున్నారని పిటిషనర్లు పేర్కొన్నారు. 150 మీటర్ల దూరంలో ఓక్రిడ్జ్ స్కూల్ ఉన్న విషయాన్ని పట్టించుకోకుండా రెడ్‌మిక్స్ ప్లాంట్ ఏర్పాటు చేయడం వల్ల పర్యావరణ కాలుష్యం తీవ్రంగా ఉందన్నారు. ఈ భూమికి సంబంధించిన పాత సర్వే నెంబర్లను సవరించి కొత్తగా సర్వే నెంబర్లు కేటాయిస్తూ 1995లో జిల్లా రెవెన్యూ అధికారి ఇచ్చిన ఆదేశాలను కొట్టేయాలని కోరారు. సదరు ఉత్తర్వులకు అనుగుణంగా రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, సీసీఎల్ఏ, జిల్లా కలెక్టర్, తహసీల్దార్ సదరు ప్రభుత్వ భూమిని ప్రతివాదులకు బదిలీ చేయడం చెల్లదని ప్రకటించాలన్నారు. కలెక్టర్ ఎన్‌వోసీ ఇవ్వడంతో జీహెచ్‌ఎంసీ భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేసిందని, రెవెన్యూ, మునిసిపల్, జీహెచ్‌ఎంసీ చట్టాలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ అక్రమాలను అడ్డుకోవాలని కోరారు. ఈ పిటిషన్ సోమవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. పిటిషనర్ల తరపున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదిస్తూ తన భూములను తాను రక్షించుకోవడం ప్రభుత్వ బాధ్యత అని, సుప్రీంకోర్టు కోర్టు గతంలో పలు ఇతర కేసుల్లో ఇచ్చిన తీర్పులు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు. ఈ భూమి విలువ రూ.10 వేల కోట్లు ఉంటుందన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రతివాదులతో కుమ్మక్కై భూకబ్జా చేశారని తీవ్ర ఆరోపణ చేశారు.

# టార్గెట్ టెహ్రాన్!

- టెహ్రాన్ లక్ష్యంగా దాడులకు సిద్ధమవుతున్న ఇజ్రాయెల్
- ప్రజలు వెళ్లిపోవాలంటూ హెచ్చరికలు
- ప్రాణరక్షణ కోసం పొరుగు దేశాలకు పారిపోతున్న ఇరాన్ ప్రజలు
- ఇజ్రాయెల్‌పై దాడులను పెంచిన ఇరాన్ - టెల్‌అవీవ్ శివార్లలో భారీ విధ్వంసం



**టెల్‌అవీవ్/టెహ్రాన్/న్యూఢిల్లీ, జూన్ 16:** ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను ఇజ్రాయెల్ టార్గెట్‌గా చేసుకుంటోంది. "మీరంతా వీలైనంత త్వరగా టెహ్రాన్‌ను వదిలి వెళ్లండి. సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లండి" అంటూ ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) అధికారులు అరబిక్, పర్షియా భాషల్లో టెహ్రాన్ పౌరులకు సందేశాలు పంపుతున్నారు. దాంతో.. వేల మంది ఇరానీలు టెహ్రాన్ నగరాన్ని వీడుతున్నారు. సోమవారం ఉదయం నుంచే ఇరాన్‌లోని ఇతర ప్రావిన్సులతోపాటు.. పాకిస్థాన్, అజర్‌బైజాన్, తుర్కియే, తుర్క్మెనిస్థాన్ దేశాలకు తరలివెళ్తున్నారు. దీంతో.. టెహ్రాన్ వీధులన్నీ కార్లతో నిండిపోయాయి. పాకిస్థాన్ సరిహద్దుల్లో ఇరానీలు గేట్లను తోసుకుంటూ లోనికి వెళ్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. "టెహ్రాన్ పౌరులు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు సందేశాలు పంపాం. మేము టార్గెట్‌గా చేసుకోబోతున్న ప్రాంతాల వివరాలను అందజేశాం" అని ఐడీఎఫ్ అధికార ప్రతినిధి మేజర్ కమల్ పిన్హాసీ పిలుపునిచ్చారు. ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ కూడా ఇవే హెచ్చరికలు చేశారు. దీంతో.. సోమవారం అర్ధరాత్రి నుంచి టెహ్రాన్‌పై భీకర దాడులు చేసేందుకు ఐడీఎఫ్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. టెహ్రాన్ వాసులకు హెచ్చరికలు జారీ చేయడానికి ముందు కాట్జ్ ఓ ప్రకటన చేశారు. "ఇరాన్‌లోని మూడోవంతు గగనతల రక్షణ వ్యవస్థలను మేం నిర్వీర్యం చేశాం. ఇప్పుడు టెహ్రాన్‌తోపాటు.. కీలక ప్రాంతాల్లో గగనతలాన్ని మేం నియంత్రించగలం" అని వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని నిర్ధారించారు. దీన్ని బట్టి సోమవారం అర్ధరాత్రి దాటాక టెహ్రాన్‌పై భీకర వైమానిక దాడులు జరుగుతాయని తెలుస్తోంది. కడపటి వార్తలందేసరికి ఇరాన్ సెంట్రల్ కమాండ్‌లోని పలు లక్ష్యాలపై, ఇస్ఫహాన్ అణుకేంద్రంపై ఇజ్రాయెల్ దాడులు జరిగాయి. టెహ్రాన్ వైమానిక స్థావరంపై జరిపిన దాడిలో రెండు ఎఫ్-14 ఫైటర్ జెట్లు ధ్వంసమయ్యాయి. వీటితోపాటు.. ఇరాన్ డ్రోన్ల యూనిట్‌ను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. క్షిపణులను తరలిస్తున్న ట్రక్కులను టార్గెట్లుగా చేసుకుని, దాడులు చేసినట్లు తెలిపింది. పశ్చిమ, మధ్య ఇరాన్‌లోనూ డజన్ల కొద్దీ డ్రోన్ దాడులు జరిగాయి. ఈ ప్రాంతాల్లో ఉన్న ఇరాన్ క్షిపణి, యూఏవీ కేంద్రాలను ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ వార్తాసంస్థ 'వైనెట్' వెల్లడించింది.

# రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పాలన దేశంలోనే బెస్ట్

**బిబి ఇందిరమ్మ ఇల్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యం**

**బిరేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేస్తుంది**

**మాజీ పార్లమెంట్ సభ్యులు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్**



**కురవి జూన్ 16 ( తొవ్వ న్యూస్)**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రభుత్వాన్ని పార్టీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు మాజీ పార్లమెంటు సభ్యులు టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కొలువై ఉన్న శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వార్లను ట్రైబల్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ తో కలిసి స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన ఆయనకు పార్టీ నాయకులు కార్యకర్తలు వెంటరాగా అర్చకులు వేదమంత్రోత్సారనాల తో స్వాగతం పలికి స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం సుభిక్షంగా ఉండాలని ఈ సంవత్సరం పంటలు సమృద్ధిగా పండి రైతులు ఆందోత్సవంతో ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. నేటి నుంచి రైతు భరోసా రైతులకు పెట్టుబడి సాయం వస్తాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లోటు బడ్జెట్ ల ఉన్నా కూడా ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం. ఆలయ చైర్మన్ కోర్నీ రవీందర్ రెడ్డి. పిఎసిఎస్ చైర్మన్ గార్లపాటి వెంకటరెడ్డి. బాదావత్ రాము నాయక్. ఆవిర మోహన్ రావు. బాలగాని శ్రీనివాస్. నారాయణ రాజేందర్. మండల యూత్ అధ్యక్షులు డాక్టర్ శరత్. దొంగల జనార్దన్ రెడ్డి. దళితరత్న దైదభద్రయ్య. డాక్టర్ వీరన్న నాయక్. లింగ్యా నాయక్. శ్యామల శ్రీనివాస్. చిన్నం గణేష్. దయ్యాల శ్రీధర్. లాలా నాయక్. కోర్నీ అనిల్. తదితరులు పాల్గొన్నారు

# మావోయిస్టు పార్టీతో వెంటనే శాంతి చర్చలు జరపాలి

**ఏజెన్సీలో ఉన్న పోలీసు బలగాలను వెంటనే వెనక్కి రప్పించాలి**

**బయ్యారం,తోవ్వ,జూన్ 16**
ఆదివాసీలపై జరుపుతున్న యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ జూన్ 17న హైదరాబాదులో జరుగు మహాధర్నాను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి నందగిరి వెంకటేశ్వర్లు. ఆదివాసి ప్రాంతాల్లో ఉన్న అనేక రకాల ఖనిజసంపదను కార్పొరేట్ సంస్థలకు బౌలజాతి కంపెనీలకు అప్పజెప్పటం కోసమే ఆపరేషన్ కగార్ అని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మహబూబాబాద్ డివిజన్ కార్యదర్శి నందగిరి వెంకటేశ్వర్లు అన్నారు. వివిధ గ్రామాల్లో గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న సందర్భంగా మాట్లాడుతూ అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులు ఫిఫ్త్ షెడ్యూల్ సిక్స్ షెడ్యూల్ లో ఉన్న భూభాగాలు అడవుల పై ఆదివాసులకే హక్కులు ఉన్నాయని రాజ్యాంగం చట్టాలు చెబుతున్నప్పటికీ భారత రాజ్యాంగంలో ఉన్న హక్కులను కాపాడతామని ప్రమాణం చేసిన మోడీ సర్కార్ వాటి అమలును తుంగలో తొక్కి దేశ సంపదను ముఖ్యంగా ఆదివాసి ప్రాంతాల్లో ఉన్న ఖనిజ సంపదను బడా పెట్టుబడిదారులకు సామ్రాజ్యవాదు లకు తెగ నమ్మటానికి చట్ట సవరణ లు చేస్తూ ఆదివాసీల హక్కులను హరించి వేస్తూన్నారు.ప్రశ్నిస్తున్న వారిని అడ్డుపడుతున్న ఆదివాసులను అమానుషంగా హత్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కనీస పౌర.ప్రజాస్వామ్య హక్కులను హరించి వేస్తూ 2026 మార్చి చివరి నాటికి నక్సలైట్లను అంతమొందిస్తామని హెచ్చరికలు జారీ చేస్తూ ప్రకటనలు ఇవ్వడం సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందని అన్నారు. ఈ దేశంలో ఉన్న దోపిడీ.పీడన అణిచివేత పేదరికం అసమానతలు లేని నవ సమాజ స్థాపన కోసం పోరాడుతున్న



దేశభక్తులైన నక్సలైట్ల ను వారికి సహకరిస్తున్న ఆదివాసులను అమానుషంగా అంతం చేసే అనాగరిక చర్యలను ప్రజలు ప్రజాస్వామిక వాదులు పౌర ప్రజాస్వామ్య హక్కులను కాపాడే వారందరూ గమనిస్తున్నారని అన్నారు.నక్సలిజాన్ని అంతం చేయడం హిట్లర్ కే సాధ్యం కాలేదని గుర్తు చేసుకోవాలని మోడీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఇప్పటికైనా ఆర్.ఎస్.ఎస్ బిజెపి హిందుత్వ మతోన్మాద మోడీ సర్కార్ ఆపరేషన్ కాగర్ వెంటనే నిలుపుదలచేసి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని ఆదివాసులపై చేస్తున్న అధర్మ యుద్ధాన్ని ఆపు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 17న హైదరాబాదులో ఇందిరా పార్క్ వద్ద జరుగు మహాధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మహబూబాబాద్ డివిజన్ కమిటీ పార్టీ శ్రేణులకు. ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అభివృద్ధి,సంక్షేమమే బిజెపి ప్రభుత్వ ధ్యేయం

**- రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో బిజెపి అభ్యర్థులను గెలిపించాలి**

**- బిజెపి మండల అధ్యక్షులు నాయిని శ్రీనివాస్.**

**బయ్యారం,తోవ్వ,జూన్ 16**
దేశంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం పని చేస్తున్నదని బిజెపి మండల అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ వెల్లడించారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.బిజెపి ప్రభుత్వం 11 ఏళ్ళ పరిపాలనలో చేసిన వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో దేశం అభివృద్ధిలో ముందుకెళ్తుందని తెలిపారు. ఈ సందర్భంగా తుమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 11 సంవత్సరాల పాలనలో అన్ని వర్గాల ప్రజలకు పలు అభివృద్ధి సంక్షేమ పథకాలను అందించారని ఆయన చెప్పారు. బిజెపి ప్రభుత్వ పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఆయన చెప్పారు.తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయలేని హామీలను చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కేంద్ర



బిజెపి ప్రభుత్వం ఇస్తున్న నిధులతోనే పాలన చేస్తుందని ఆయన అన్నారు.అన్ని వర్గాల ప్రజలను బిజెపి పార్టీ సమదృష్టితో చూస్తూ అభివృద్ధి, పథకాలను అందచేస్తున్నదని ఆయన చెప్పారు. బిజెపి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఊకె రామ్మూర్తి తెలిపారు.

# రామన్నపేట మండల ప్రజారోగ్యంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

**- అద్వాన స్థితిలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని మెరుగుపరచాలి - సిపిఎం ఆధ్వర్యంలో రామన్నపేట ప్రభుత్వాసుపత్రి పరిశీలన**

**యాదాద్రి జిల్లా: రామన్నపేట: తోవ్వ ప్రతినిధి :జూన్ 16**
రామన్నపేట మండలం పరిసర ప్రాంతాల్లో వేలాది మందికి 50 ఏండ్ల నుండి వైద్య సౌకర్యం అందించే ప్రభుత్వ ఆసుపత్రి పట్ల ప్రభుత్వ యంత్రాంగం, వైద్యాధికారుల నిర్లక్ష్య వైఖరి సరికాదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలోస్థానిక మండల నాయకత్వంతో కలిసి సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలన చేసి సర్వే నిర్వహించి, రోగులను సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగింది . ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 50 సంవత్సరాల క్రితం కట్టిన భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి పెచ్చులూడిపోతూ ప్రమాదకరంగా మారి పెచ్చులు రోగుల మీద పడుతున్నాయి. ఆసుపత్రి పరిసరాల చుట్టూ కాలుష్యం, మురికి నీరు పేరుకుపోయి రోగులు మరింత రోగాల బారిన పడుతున్న



పరిస్థితి నెలకొన్నది. 22 మంది డాక్టర్లు ఉండాల్సిన హాస్పిటల్లో కేవలం నలుగురు రెగ్యులర్ డాక్టర్లు మాత్రమే ఉండడంతో రోజుకు 400 మంది పేదలు వైద్యం అందక అనేక అవస్థలు పడుతూ దూరప్రాంతాలకు వెళ్లి ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. కనీసం మంచినీటి సౌకర్యం లేక మెరుగైన శాస్త్ర సాంకేతిక వైద్య పరికరాల సౌకర్యం లేక చిన్న రోగం వచ్చిన ప్రైవేటు ఆసుపత్రికి పోయే పరిస్థితి నెలకొన్నది. గత కాలంలో రోజుకు 10 ప్రసవాలు అయ్యే పరిస్థితి నుండి నేడు నెలకు 10 ప్రసవాలు మాత్రమే అయ్యే పరిస్థితి దాపురించిందని దీనికి ప్రభుత్వం యంత్రాంగం, వైద్యాధికారులే బాధ్యత వహించాలని వెంటనే జిల్లా కలెక్టర్ సందర్శించి వంద పడకల హాస్పిటల్ నూతన భవనానికి నిధులు మంజూరు కోసం కృషి చేయాలని వెంటనే ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ప్రజలను సమీకరించి భారీ ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బలుగూరి అంజయ్య, కల్లూరి నాగేష్, మండల కమిటీ సభ్యులు మాజీ వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్,బావండ్లపల్లి బాలరాజు, గొరిగే సోములు పట్టణ శాఖ కార్యదర్శి మునికుంట్ల లెనిన్, శాఖా కార్యదర్శులు పులిబిక్షం,కూనూరు మల్లేశం, శానగొండ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ జల్లెల లక్ష్మమ్మ, పండుగ రాజమల్లు, పొట్లచెరువు నాగయ్య, తుర్కపల్లి నరేష్, గట్టు జ్యోతిబసు, గుణగంటి మల్లేశం, గట్టు గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు యూనిఫామ్స్ పంపిణీ

**వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి**



**తొవ్వ,కేసముద్రం,జూన్ 16:**
మండలంలోని కల్వల మోడల్ స్కూల్ విద్యార్థులకు స్థానిక వ్యవసాయం కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి ప్రిన్సిపాల్ పరిమి నవీన్,ఉపాధ్యాయ, ఉపాధ్యాయిని లతో కలిసి గురువారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభానికి ముందే ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ పాఠశాలలకు సరఫరా చేయడం సంతోషదాయకమన్నారు.సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో టీచర్స్, పేద ప్రకాష్ సోమయ్య నాగరాజు పార్థసారధి సురేందర్ నరసయ్య దుర్గాప్రసాద్ విజయ కుమారి శ్వేత శ్రీదేవి విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయునితో కలిసి స్టూడెంట్స్ కు బుక్స్ పంపిణీ చేశారు.

## జర్నలిస్టుల పిల్లలకు ప్రయివేట్ పాఠశాలాల్లో ఉచిత విద్యను అందించాలి

**టీఎస్‌జేయూ ఎన్యుజే ఇండియా**



**తొవ్వ, కేసముద్రం, జూన్ 16 :** మహబూబాబాద్ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రయివేట్ పాఠశాలల్లో 100 శాతం ఫీజు రాయితీ కల్పించి ఉచిత విద్యను అందించాలని,మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ కు తెలంగాణా స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ జిల్లా నేతలతో కలసి వినతి పత్రంఅందజేశారు.అనంతరం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు చిర్రగోని ఉదయ్ ధీర్ మాట్లాడుతూ రాత్రానకా పగలనక నిరంతరం వార్తల కోసం తిరుగుతూ,ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తూ ఎటువంటి లాభాపేక్ష లేకుండా అందరి శ్రేయస్సు కోసం పాటుపడే జర్నలిస్టులకు ప్రభుత్వం కనీస సౌకర్యాలు తప్పకుండా కల్పించాలని,మహబూబాబాద్ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు అన్ని ప్రయివేటు పాఠశాలల్లో ఉచిత విద్యా భోధన అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ కు,జిల్లా విద్యా శాఖా అధికారి రవీందర్ రెడ్డి కి వినతి పత్రం అందించామన్నారు.ఇటీవల తమ టీఎస్ జేయు ఎన్యుజే ఇండియా పోరాటంతో ములుగు జిల్లా కమిటీ అక్కడి జర్నలిస్టుల పిల్లలకు వందశాతం ఫీజు రాయితీ కల్పించిన సంగతి గుర్తు చేస్తూ కాపీ వినతిపత్రానికి జత చేసినట్లు కలెక్టర్ ,విద్యా శాఖాధికారి సత్వరం ఈ వినతి పై సానుకూల స్పందన ప్రకటించాలని కోరినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీపీఆర్వో రాజేంద్ర ప్రసాద్,జిల్లా టీయస్ జేయూ నేతలు పోతుగంటి సతీష్,గాండ్ల కిరణ్,జెల్లీ శ్రవణ్, మల్లారపు నగేష్ శెట్టి వెంకన్న,మిట్టగడుపుల మహేందర్,తాడూరి ఉమేష్ శర్మ,కేసముద్రం మండల అధ్యక్షులు మంద విక్రం,కందుకూరి రాజేందర్, సతీష్,జన్ను శ్రీనివాస్,గంధసిరి యాకాంబ్రం తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌కు ఎంపికైన విద్యార్థినికి ప్రోత్సాహక నగదు



**తొవ్వ,నెల్లికుదురు జూన్ 16**
ఎన్ ఎం ఎస్ స్కాలర్షిప్ కు ఎంపికైన మండలంలోని ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి అశ్విని కి అదే పాఠశాల ఉపాధ్యాయిని అనిత రూ 1000 ప్రోత్సాహక నగదును అందజేసినట్లు మండల విద్యాశాఖ అధికారి ఏ రాందాస్ తెలిపారు .స్కాలర్షిప్ కు ఎంపికైన విద్యార్థిని ని సోమవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్ కు ఎంపికైన ప్రతి విద్యార్థికి ఇంటర్మీడియట్ పూర్తయ్యేంతవరకు నెలకు రూ 1000చొప్పున ప్రభుత్వం స్కాలర్షిప్ అందిస్తారని చెప్పారు అశ్విని ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థి ఎన్.ఎం.ఎస్ స్కాలర్షిప్ కు అర్హత సాధించేలా శ్రమించాలని సూచించారు. పాఠశాలలో ఏ విద్యార్థి ఈ స్కాలర్షిప్ కు ఎంపికైన వారందరికీ నగదు ప్రోత్సాహకం అందజేస్తామని పాఠశాల ఉపాధ్యాయులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వారం రోజుల్లో చెరువు కట్ట నిర్మాణ పనులు పూర్తి

**- చెరువు కట్ట నిర్మాణ పనులకు శంకుస్థాపన, - బిబిగత సెప్టెంబర్ లో కురిసిన వర్షాలకు తెగిన చెరువు కట్ట,**

**- బిబిబిఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ తోటి అభివృద్ధి, - కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బండి లక్ష్మారెడ్డి**



**కురవి జూన్ 16 ( తొవ్వ న్యూస్)**
గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో అత్యధిక వర్షాలు కురవడంతో అయ్యగారి పల్లి పెద్ద చెరువు కట్ట తెగిపోవడంతో నేడు ఆకట్టుకు మరమ్మతులు చేసేందుకు పనులు ప్రారంభించినట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బండి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అయ్యగారి పల్లి గ్రామంలోని పెద్ద చెరువు తెగిపోయిన కట్ట నిర్మాణ పనులకు తెలంగాణ శాసనసభ డిప్యూటీ స్పీకర్ డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రామచంద్రనాయక్ కృషితో 16 లక్షలు మంజూరయ్యాయని (టెండర్ వర్క్) అన్నారు.వర్షాకాలం సమీపించింది చెరువులో నీళ్లు లేకపోతే రైతులు పంట పండించటం కష్టతరంగా మారుతుందని రైతులు ఆందోళన చెందుతున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకపోగా వెంటనే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ కమార్ రెడ్డి తో మాట్లాడి నిధులు మంజూరు చేయించి నట్లు ఆయన తెలిపారు. డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధి శాసనసభ ఉపసభాపతి తోటే చెందుతుందని తెలిపారు. కొద్దిరోజుల్లో చెరువు కట్ట నిర్మాణం పూర్తి చేసి తూములు కూడా పూర్తిస్థాయిలో రిపేర్లు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తవణం సుఖేందర్ రెడ్డి. గ్రామ పార్టీ కార్యదర్శి జక్కుల నగన్న. సీనియర్ నాయకులు వేమిశెట్టి ప్రసాద్. బజ్జూరి చైతన్య రెడ్డి. కడారు రవి. బుడేగ రమేశ్. నూకల రామచంద్రు. లచ్చి నారి. దూదిమట్ల రవి. నల్లు మధుసూదన్ రెడ్డి. బజ్జూరి రామచంద్ర రెడ్డి. బొల్లు వెంకన్న. కాకి వీరన్న. బుడిగ రవీందర్. రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్య కళాశాలలో మౌనం పాటించిన ప్రిన్సిపాల్ డాక్టర్. దివ్వెల మోహన్ దాస్

**ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి : సూపరిం డెంట్ డాక్టర్. కిషన్**



**తొవ్వ, ప్రతినిధి, ఖానాపూర్, జూన్ 16:**
ఈరోజు నర్సంపేట ప్రభత్వ వైద్య కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ Dr.దివ్వెల మోహనదాస్, సూపరిండెంట్ Dr. కిషన్ ఆధ్వర్యంలో కళాశాలలో పని చేయుచున్న అన్ని హెడ్ హాఫ్ డిపార్టుమెంటు ప్రొఫసర్స్ మరియు అసిస్టెంట్ ప్రొఫసర్స్, సిబ్బందితో కలసి దివి 14-6-2025 రోజున దివంగతులైన స్వర్గీయ Dr దొడ్డ మోహనరావు గారి ఆత్మకు శాంతి చేకూరాలని 2నిముషాలు మౌనం పాటించి సంస్మరణ సభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ Dr దివ్వెల మోహనదాస్ గారు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల స్థల దాత, మంచికి మారు పేరు, సహనశీలి, మానవత్వం మూర్తీభ వించిన మహెూన్నత వ్యక్తి గా సమాజ సేవ పరమవాదిగా భావించి, అనేక గొప్ప దాన ధర్మాలు చేసి, అందరి హృదయలలో సుస్తీర స్థానం పొంది, మనఅందరికి ఆదర్శంగా నిలిచారు. అదేవిదంగా అడగగానే ఆపరేషన్ థియేటర్ పరికారాలు ఇప్పించారాని అతని ఆత్మకు శాంతి కలగాలని వారి కుటుంబ సభ్యులకు దేవుడు మనోధైర్యాన్ని కల్పించాలని కోరారు.

## రైతుల్లో వ్యవసాయ పరిజ్ఞానాన్ని పెంపొందింప చేయడమే లక్ష్యంగా వీడియో కాన్ఫరెన్స్‌లు

**మండల వ్యవసాయ అధికారి ఎస్.కె యాస్మిన్**




**తొవ్వ, నెల్లికుదురు, జూన్ 16**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల్లో వ్యవసాయ పరిజ్ఞానాన్ని పెంపొందింప చేయడమే లక్ష్యంగా నూతనంగా వీడియో కాన్ఫరెన్స్ లు ఏర్పాటు చేయడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి ఎస్ కే యాస్మిన్ తెలిపారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని 10 31 రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం చేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలో రెండవ దశలో నెల్లికుదురుకు అనుసంధానం జరిగిందని, ప్రస్తుతం మూడవ దశలో మునిగల వీడు, ఆలేరు గ్రామ రైతువేదికలకు అనుసంధానం చేయడం జరిగిందన్నారు. కాన్ఫరెన్స్ల ద్వారా రైతు నేస్తం కార్యక్రమం ప్రతి మంగళవారం హైదరాబాదులోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని అనుభవజ్ఞులైన వ్యవసాయ శాస్త్రవేత్తలచే ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఏఏ నెలల్లో ఎటువంటి పంటలు వేసుకోవాలి, సస్యరక్షణ చర్యలు ఎలా చేపట్టాలి, అనే సమగ్ర సమాచారాన్ని వారు రైతులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటించి వ్యవసాయంలో అధిక లాభాలు పొందడానికి వీలుంటుందని తెలిపారు . కావున రైతులు ప్రతి మంగళవారం ఉత్సాహవంతమైన రైతులు ఆయా రైతు వేదికలకు చేరుకొని సమాచారాన్ని నేరుగా తెలుసుకోవచ్చున్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రారంభోత్సవంలో నెల్లికుదురు, శ్రీరామగిరి సహకార సంఘాల చైర్మన్లు కాసం లక్ష్మీ చంద్రశేఖర్ రెడ్డి, గుండా వెంకన్న, తహసిల్దార్ చందా నరేష్, ఎంపీడీవో బాలరాజు ఏ ఈ ఓ లు వల్లంల ప్రవీణ్, రాంపెల్లి చందనగౌడ్, ఈ రవి, ప్రతిభ, మణికంఠ పెస్టిసైడ్స్ ఫర్టిలైజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పెరుమాండ్ల శంకర్ గౌడ్, గుండెబోయిన అశోక్ యాదవ్,రాపాకవీరభద్రరావు యాదవ్, గ్రామాల్లోని రైతులు తదితరులున్నారు.

## ఇందిరా పార్క్ వద్ద జరిగే నేటి మహాధర్నాన్ని జయప్రదం చేయండి

**సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ తొర్రూరు.డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగన్న**

**దంతాలపల్లి సబ్ డివిజన్ కార్యదర్శి చిర్ర యాకన్న**



తొవ్వ, దంతాలపల్లి జూన్. 16
మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలో.సిపిఐ ఎం ఎల్ న్యూడెమోక్రసీ తొర్రూరు.డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో 17వ తేదీన ఆపరేషన్ కగార్ పేరిట కొనసాగిస్తున్న హత్యా కాండను వెంటనే ఆపాలని మోడీ ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టు పార్టీతో బేశరత్తుగా శాంతి చర్చలు జరపాలనీ డిమాండ్ చేస్తూ హైదరాబాద్ ఇంద్ర పార్క్ వద్ద జరిగే మహా ధర్నా విజయవంతం కై తేది:16- 06- 2025 దంతాలపల్లి మండల కేంద్రంలో. మహా ధర్నా పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ (ఎం ఎల్) న్యూడెమోక్రసీ పార్టీ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగన్న. దంతాలపల్లి సబ్ డివిజన్ కార్యదర్శి చిర్ర యాకన్న. మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరిట కొనసాగుతున్న మధ్య భారతంలో ఆదివాసి జాతి జననానికి కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం హత్యాకాండ కొనసాగిస్తుందన్నారు. మావోయిస్టు పార్టీ నాయకులను బూటకపు %ఎ%ఎన్కౌంటర్ల పేరిట హత్యలు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టు పార్టీ తో చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న హైదరాబాదులో జరిగే మహాధర్న కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎం ఎల్ న్యూ డెమోక్రసీ దంతాలపల్లి సబ్ డివిజన్ నాయకులు. ఊడుగుల అనిల్ వల్లపు.రాములు, వెంకన్న, లక్ష్మి, నరేష్,రాజు,నవ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## శభాష్ పంతులు..!

**ప్రభుత్వ పాఠశాలలోనే తమ కుమార్తె చదువు..**

**ఆదర్శవంతంగా నిలిచిన సయ్యద్**




**తొవ్వ, కేసముద్రం ,జూన్ 16:**
తమ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం కార్పోరేట్ బడుల్లో చేర్పించి చదువు చెప్పిస్తున్న అనేకమంది ప్రభుత్వ పంతులను చూస్తున్నాం.. కానీ కేసముద్రం మండలంలోని కల్వల ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు తాము చదువు చెప్పే బడిలోనే తమ పిల్లలను చదివించాలని ఉద్దేశంతో పాఠశాలలో ఎస్ జీటి గా విధులు నిర్వహిస్తున్న ఎస్.కె సయ్యద్ తమ కూతురు తయ్యబాను ను సోమవారం ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి శభాష్ పంతులు అనిపించుకున్నాడు. ప్రభుత్వ పాఠశాల పంతులు తమ కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం పట్ల గ్రామస్తులు ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఇదే రీతిలో పలువురు పంతుళ్ళు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

## తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్స్ అడ్మిషన్ల కొరకు మండల స్థాయిలో ఎంపిక..



**తొవ్వ,కేసముద్రం, జూన్ 16:**
రాష్ట్ర స్థాయి క్రీడా పాఠశాలలైన హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్స్ లో నాలుగవ తరగతిలో అడ్మిషన్ల కొరకు మండల స్థాయి సెలెక్షన్స్ లో భాగంగా కేసముద్రం మండలంలోని కేసముద్రం స్టేషన్ ఉన్నత పాఠశాలలో దివి: 19.06.2025 గురువారం రోజున ఉదయం 10 గంటల నుండి పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలలో పాల్గొనే విద్యార్థులు మూడవ తరగతి ఉత్తీర్ణత పొంది ఇప్పుడు నాలుగో తరగతి చదువుతూ ఉండాలి. మరియు వారు 01.09.2016 నుండి 31.08.2017 మధ్య జన్మించిన వారై ఉండాలి. ఈ యొక్క పోటీలు మండల విద్యాశాఖాధికారి శ్రీ కాలేరు యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతాయి అని తెలియజేశారు. ఇందులో పాల్గొనే విద్యార్థులు 19 వ తేదీ లోపే **tgss.telangana.gov.in% nHû %website** కి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వెబ్ సైట్ లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు మాత్రమే ఈ పోటీలకు హాజరు కావాలని తెలియజేశారు. ఈ పోటీలలో పాల్గొనే విద్యార్థులు

1. రెండు పాస్ ఫొటోలు
2. జనన ధ్రువీకరణ పత్రము స్కూలు నుండి
3. జనన ధ్రువీకరణ పత్ర ము (ఎమ్మార్వో లేదా మున్సిపాలిటీ నుండి )
4. స్టడీ సర్టిఫికెట్ ప్రస్తుత పాఠశాల నుండి
5. మూడవ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్
6. ఆధార్ కార్డు (ఒరిజినల్)
7. కమ్యూనిటీ సర్టిఫికెట్ (కులం )
8. ఆన్లైన్ చేసిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్.

పోటీలలో పాల్గొనే విద్యార్థులు పైన సూచించిన సర్టిఫికెట్లు తీసుకురావాలని తెలియజేశారు. కావున మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను సిద్దం చేసి ఆ రోజు హాజరుపర్చగలరని కోరారు.

## గోపరాజుపల్లిలో ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ



**యాదాద్రి జిల్లా: వలిగొండ: తోవ్వ ప్రతినిధి: జూన్ 16**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని గోపరాజుపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు రుద్రపల్లి అలివేల ఇంటి నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేసి ముగ్గు పోశారు. అనంతరం గోపరాజు పల్లి కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు సలిగంజి బిక్షపతి మాట్లాడుతూ పేదోడి సొంత ఇంటి కల కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సహకారం అవుతుందని అన్నారు. అర్హులైన ప్రతి నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. ప్రజలు ఎవరు ఆందోళన పడవలసిన అవసరం లేదని సూచించారు. విడతల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాలకూర్ల మల్లేశం, కీసర్ల మహేందర్ రెడ్డి, చిల్లర స్వామి, గ్రామపంచాయతీ సెక్రటరీ నవనీత, కారోబార్ వనం జనార్ధన్, లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సాంకేతిక పరిజ్ఞానం కల్పించాలి



**తొవ్వ, నర్సింహులపేట, జూన్. 16**
రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 1031 రైతువేదికలకు వీడియో కాన్ఫరెన్సింగ్ సౌకర్యం ముఖ్యమంత్రి చే ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని నర్సింహులపేట, కౌసల్యదేవిపల్లి మరియు పెద్ద నాగారం రైతువేదికల ద్వారా ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్నిఏర్పాటు చేయడం జరిగినది. ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క మాట్లాడుతూ రైతుభరోస 9 రోజులలో చెల్లించాలని నిర్ణయించామని, ఇప్పటివరకు ప్రభుత్వం 70,000 కోట్లు ఖర్చు చేశామని, మొత్తంగా 3,50,000 కోట్లు రైతుల సంక్షేమానికి ఖర్చుచేస్తామని తెలియజేసినారు. తదుపరి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఖమ్మం, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లా రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంభాషించడం జరిగింది. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని సూచించడం జరిగింది. ఈక్రమంలో రైతులకు సాంకేతిక విజ్ఞానం, సబ్సిడీలు అందచేయాలని పేర్కొన్నారు. రైతులు సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా తమ వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలని, సౌర విద్యుత్ గా మార్చడానికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించడం జరిగింది. భూసారం ఆధారంగా పంటలు వేసుకోవాలని, గిట్టుబాటు వచ్చే పంటలు వేసుకోవాలని రైతువేదికల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించడం జరిగింది. చివరగా రైతుభరోస నిధులను ముఖ్యమంత్రి రైతులకు విడుదల చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ రమేష్, ఎం.పీ.డీ.వో కిన్నెర యాకయ్య , మండల వ్యవసాయాధికారి గంధం. వినయ్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు శరత్ చంద్ర, కళ్యాణి, రాజేంద్రప్రసాద్ లతో పాటు వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# సిపిఐ నూతన కమిటీ ఎన్నిక

**- శాఖ కార్యదర్శి గా అన్నెపు ప్రభు - సహాయకార్యదర్శిగా హరి**

**తొవ్వ ప్రతినిధి : శంషాబాద్, జూన్ 16**
శంషాబాద్ మున్సిపల్ పరిదిలోని ఎయిర్పోర్ట్ కాలనీ సిపిఐ పార్టీ శాఖ మహాసభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ ని ఎన్నుకోవడం జరిగింది. శాఖ కార్యదర్శిగా అన్నెపుప్రభు, సహాయకార్యదర్శిగా హరి ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ సమావేశానికి మండల కార్యదర్శి బి ఓ సి స్టేట్ కమిటీ మెంబెర్ నర్రా గిరి అధ్యక్షత జరిగింది. ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ కార్యవర్గసభ్యులు ఆర్ యాదగిరి ఏఐటీయూసీ మండల అధ్యక్షులు బి ఓ సి రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నెపు ప్రభు, బి ఓ సి శంషాబాద్ మండల సెక్రటరీ రాజు తదితరులు పాల్గొన్నారు.




# యుద్ధలాభం ఆయుధ వ్యాపారులకే

పహల్గామ్ ఉగ్ర దాడి తరువాత సంభవించిన పరిణామాలు విస్తృత చర్చకు దారితీశాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను కూడా స్వాధీనం చేసుకోడమే తమ ధ్యేయమన్న బీజేపీ నాయకుల సారథ్యంలో భారత్ వెనక్కి తగ్గిందనే ప్రచారం సాగింది. దీనిని తుడిచిపెట్టడానికి ఆపరేషన్ సిందూర్ విజయాన్ని చాటుతూ దేశమంతా ఊరేగింపులు జరిగాయి. వాస్తవంలో పూర్తిస్థాయి యుద్ధం దరిదాపులకు వెళ్లిన భారత, పాకిస్థాన్‌లు ఉన్నపళంగా ఘర్షణలను విరమించుకున్నాయి. ఇది సిమ్లా ఒప్పందం మేరకు రెండు దేశాల మధ్య చర్చల ద్వారానే జరిగిందని తాజాగా ప్రకటించుకున్నప్పటికీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చొరవతోనే యుద్ధం ఆగిందన్న సమాచారం మెరుపు వేగంతో వ్యాపించింది. అప్పుడు దానిని రెండు దేశాల పాలకులూ తక్షణమే ఖండించలేదు. యుద్ధమే జరిగితే సంభవించబోయే ఘోర పరిణామాల గురించి వివరించనక్కరలేదు. అటువంటి భయానక స్థితిని తొలగించినందుకు, భారత పాకిస్థాన్ పాలకులను ఇందుకు ఒప్పించినందుకు అమెరికా అధ్యక్షుడిని అభినందించడంలో తప్పు లేదు. అయితే ఇంతటితో యుద్ధ భాష ఆగకపోడమే ఆందోళనకరం. పరస్పరం పిప్పి, పిండి చేసుకోవాలన్న 'మీసాల' మెలివేత కొనసాగుతూనే ఉంది. ఇది రెండు దేశాల పాలకులు తమ ప్రజల్లో పొరుగు దేశం పట్ల ద్వేషాన్ని మరింతగా పెంచి రాజకీయంగా లాభపడడానికి పాటిస్తున్న వ్యూహమే. దీనివల్లనే శాశ్వత చర్చలకు ఆటంకం కలుగుతున్నది. ఇక్కడే మరొక బాధాకర పరిణామం%-%1971లో బంగ్లాదేశ్ అవతరణకు దారితీసిన యుద్ధంలో అమెరికాను సైతం ధిక్కరించిన ఇందిరాగాంధీతో మోదీని పోల్చుతున్నారు. తూర్పు, పశ్చిమ పాకిస్థాన్ల మధ్య తలెత్తిన ఆ యుద్ధం వల్ల లక్షలాదిమంది తూర్పు పాకిస్థానీయులు మన దేశంలోకి పారిపోయి రాడంతో ఇందిరాగాంధీ భారత దళాలతో ముక్తిబాహినిని సృష్టించి బంగ్లాదేశ్ అవతరణకు తోడ్పడ్డారు. అయితే ఆ యుద్ధం వల్ల సంభవించిన మానవ శోకం చెప్పనలవి కానిది. మోదీ పాకిస్థాన్‌ను ఆ విధంగా ఓడించ లేకపోయారని అనడం యుద్ధ పిపాసనే సూచిస్తున్నది. ఇది తమ ఓటు బలాన్ని తగ్గిస్తుందని, చేరువలో ఉన్న బిహార్ ఎన్నికల్లో దెబ్బ తింటామని బీజేపీ భయపడుతున్నది. అంతేగాని పూర్తి స్థాయి యుద్ధానికి వెళ్లకుండా నిగ్రహం పాటించినందుకు సంతోషించడం లేదు. ఆపరేషన్ సిందూర్ ద్వారా మోదీ పాకిస్థాన్ పీచమణిచారన్న అభిప్రాయాన్నీ బలంగా నాటుతున్నారు. పాకిస్థాన్‌ను మోకాళ్ళ మీదకు తెచ్చామని ఆయన కూడా ప్రకటించారు. ఈ అవకాశం, ఈ స్వేచ్ఛ తమకు ఇచ్చినందుకు భారత దళాలు ప్రధాని మోదీకి మొక్కుతున్నాయి అనేవారూ బయలుదేరారు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఇంతవరకూ జరిగిన నాలుగు యుద్ధాల్లో అసంఖ్యాకంగా సైనికులు మరణించారు. ఆయుధాలకోసం రెండు దేశాలు విశేషంగా డబ్బు తగలబెట్టాయి. భారత ఉపఖండంలో రాజకీయం ఇప్పటికీ మతోన్మాదం ప్రాతిపదికనే కొనసాగుతున్న మాట కాదనలేని సత్యం. కశ్మీర్ పరిణామాలకూ అదే ఇంధనమవుతున్నది. హిందూత్వ రాజకీయాల మత కోణం దేశ ప్రజల మధ్య సృష్టిస్తున్న విభజన గురించి వివరించనక్కరలేదు. మతపరంగానో, సరిహద్దు వివాదం పరంగానో యుద్ధం తలెత్తితే అవతలి దేశాన్ని చీల్చి చెండాడాలని, దాన్ని నామరూపాలు లేకుండా చేసేయాలని పళ్ళు పటపటా కొరకడాన్ని అటూ ఇటూ గల ప్రజలకు అలవాటు చేశారు. భారత సైనిక దళాల మాజీ అధిపతి జనరల్ మనోజ్ ముకుంద్ నరవానే యుద్ధాన్ని గురించి కొద్ది రోజుల క్రితమే మంచి మాటలు చెప్పారు. యుద్ధాలు బాలీవుడ్ సినిమాలు కావన్నారు, యుద్ధాల్లో ఎంతమంది చనిపోతారో, మరెంతమంది వికలాంగులై జీవితాంతం ఎడతెగని వ్యథను అనుభవిస్తారో గుర్తు చేశారు. కురుక్షేత్రం లాంటి యుద్ధ గాథలు సినిమాల్లో, నాటకాల్లో చూడ్డానికే బాగుంటాయి. ఒకరినొకరు నరుక్కోడం, శత్రువు రొమ్ము



చీల్చి రుధిరమ్ము తాగడం వాస్తవంలో ఎంతమాత్రం కోరదగినవి కావు. ఇప్పుడు సరిహద్దుల రక్షణలో కన్నార్పకుండా కాపలా కాస్తున్నవారిలో, యుద్ధాల్లో ప్రాణాలు విడుస్తున్నవారిలో అత్యధికులు పేద బహుజనులే. ఉపాధి కరువై పొట్ట కూటి కోసం సైన్యంలో చేరుతున్నవారే ఎక్కువమంది. పహల్గాం ఉగ్ర దాడి బహు హేయమైనది. ఈ ఉన్మాదులు భారత, పాకిస్థాన్‌లు చేరువ కాకుండా అన్ని తంత్రాలను ప్రయోగిస్తున్నారు. రెండు దేశాల మధ్య మతపరమైన దూరాన్ని పెంచి దాన్ని అధిగమించడానికి వీలు లేని స్థాయికి తీసుకువెడుతున్నారు. భారత వ్యతిరేక ఉగ్రశక్తులకు పాకిస్థాన్ సైన్యం అండదండలు లభిస్తున్నాయి. అది పాక్ ప్రేరిత ఉగ్రవాదమే. అయితే ఈ విషయాన్ని మనం నమ్ముతున్నంతగా మిగతా ప్రపంచం నమ్మడం లేదు. మిగతా దేశాలు భారత్, పాకిస్థాన్లను ఒకేలా చూస్తున్నాయి. ఈ విషయాన్ని భారత పాలకులు తెలుసుకోవాలి. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్‌ను భారత్ గట్టి దెబ్బే తీసింది. అంతటితో ఆగకుండా పాకిస్థాన్ నిజస్వరూపాన్ని తెలియజేయడానికి దేశ దేశాలకు పార్లమెంటు సభ్యుల బృందాలను పంపించడం బాగుంది. అయితే అది కూడా రాజకీయ విభేదాలకు దారి తీయడం బాధాకరం. పాకిస్థాన్‌పై బలంగా విరుచుకుపడ్డాం గాని పహల్గాం దాడి ముష్కరులను కనుక్కోడంలో జాప్యం జరుగుతున్నది. వారెవరో స్పష్టంగా తెలిస్తే బాగుంటుంది. ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలని భావిస్తున్న దేశాల ప్రజలు యుద్ధోన్మాదంతో వూగిపోడం సరైనది కానే కాదు. ఇది రక్షణ ఖర్చును ఆకాశానికి చేర్చి ప్రజలను కనీస విద్య, వైద్యం కూడా దొరకని దారిద్ర్యంలో కూరుకుపోయేలా చేస్తుంది. వాస్తవానికి టెర్రరిజం సమస్య చాలా లోతైనది. ప్రపంచ పాలకులు ముఖ్యంగా అమెరికా ఇజ్రాయెల్ వంటి దేశాలు చిత్తశుద్ధితో ఆలోచిస్తే వాటి అసలైన మూలాలు కనిపిస్తాయి. భారత పాకిస్థాన్‌లకూ ఇదే వర్తిస్తుంది. టెర్రరిజం గాని, వామపక్ష ఉగ్రవాదం గాని ఊరకే ఆకాశం నుంచి ఊడిపడేవి కావు. మెజారిటీ, మైనారిటీలు హాయిగా శాంతియుత సహజీవనం చేస్తున్న చోట సెక్యులరిజం వర్ధిల్లుతున్న దేశంలో మతపరమైన మెజారిటీని మైనారిటీల మీదికి రెచ్చగొట్టడం ప్రజాస్వామ్యమనిపించుకోదు. పాక్‌కు జీలం నది నీటిని ఆపడం గాని, ఘర్షణలకు కారణమయ్యారని భావించి వారి ఇళ్లు కూల్చి తల మీద కప్పు లేకుండా చేయడం గాని మానవీయమైన పనులు కావు. కక్ష కక్షనే ఇస్తుంది. ఉగ్రవాదానికి అది కూడా దారి తీస్తుంది. మన దేశంలో అధిక సంఖ్యాకుల మతస్వామ్యం వంటిదే రాజ్యమేలుతున్నది. వక్ఫ్ బిల్లులో మోదీ ప్రభుత్వం తేదలిచిన మార్పులను సెక్యులర్ రాజ్యాంగ రక్షకురాలైన సుప్రీంకోర్టు తీవ్రంగా ప్రశ్నించడమే ఇందుకు నిదర్శనం.

## పెళ్లి చేసుకుంటానని నమ్మించి 47 ఏళ్ల మహిళపై లైంగికదాడికి పాల్పడిన 42 ఏళ్ల వ్యక్తి

**తొవ్వ : 16 జూన్,ఎల్బీనగర్ ప్రతినిధి**



బేగంపేటకు చెందిన ఓ మహిళ(47)కు ఓ వివాహ వెబ్ సైట్ ద్వారా పరిచయమై పెళ్లి చేసుకుంటానని నమ్మించిన ముంబయికి చెందిన శశికాంత్ కక్కడ్(42). 2023 జనవరిలో బేగంపేటకు వచ్చిన శశికాంత్ ఓ హోటల్ లో రూం తీసుకొని మహిళపై అత్యాచారం. ఇలా పలుమార్లు హైదరాబాద్‌కు వచ్చి మహిళపై లైంగిక దాడి చేసిన శశికాంత్. తనకు బాగా ఆస్తి ఉందని పెళ్లి చేసుకుంటానని నమ్మించి, షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టాలని చెప్పి మహిళ దగ్గర మొత్తం రూ.24 లక్షలు తీసుకొని ఉడయించిన శశికాంత్. బాధితురాలు పెళ్లి, డబ్బుల విషయం అడగగా.. తనను కలిసినప్పుడు తీసుకున్న ఫోటోలు వీడియోలు వైరల్ చేస్తానంటూ బెదిరించిన శశికాంత్. దీంతో బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళ.. అత్యాచారం, మోసం కింద కేసు నమోదు చేసి శశికాంత్ కోసం గాలిస్తున్న పోలీసులు.

# ఘనంగా రైతు నేస్తం..

**ముఖ్యమంత్రి తో రైతుల వీడియో కాన్ఫరెన్స్**

**- వ్యవసాయ విస్తరణ అధికారి విజయకుమార్**



**తొవ్వ.జూన్ 16.సంస్థాన్ నారాయణపురం :**
సంస్థాన్ నారాయణపురం మండలంలోని జనగాం గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది. రైతులకు సంబంధించిన విషయాలను గురించి తెలియజేయడం జరిగింది కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ రైతుల పక్షాన ఉంటుంది రేపు రైతు భరోసా నిధులు కూడా విడుదల చేయడం జరిగింది అని ముఖ్యమంత్రి గారు చెప్పడం జరిగిందిఈ కార్యక్రమంలో చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ లోడే రఘు మరియు ఏఈవోలు విజయకుమార్ గారు మరియు పంచాయతీ కార్యదర్శిలు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కరెంటు శ్రీను నాయక్ ప్రజా ప్రతినిధులు మరియు ప్రజలు పాల్గొనడం జరిగింది.

## రైతు నేస్తం కార్యక్రమంలో ముఖ్యమంత్రితో రైతుల ముఖ ముఖి

**తొవ్వ ,మహబూబాబాద్ ,జూన్ 16:**



రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా హైదరాబాదులోని రాజేంద్రనగర్ లో ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి రైతు నేస్తం కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా (1031) రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అనుసం ధానం చేశారు, జిల్లాలో నూతనంగా (35) రైతు వేదికలలో ప్రారంభిం చారు,మహబూబాబాద్ మండలం జమండ్లపల్లి, చంద్రు తండాకు చెందిన అజ్మీర ద్వాలీ, భర్త కీమ్య, అనే మహిళ రైతుతో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి , మాట్లాడి తను సాగు చేస్తున్న వివరాలు అడిగి తెలుసుకున్నారు,ఈ సందర్భంగా ద్వాలీ మాట్లాడుతూ తనకు ప్రభుత్వం కల్పించిన రైతు రుణమాఫీ కింద 1లక్ష 65, 509 వేల రూపాయలు రుణమాఫీ అయిందని, రైతు భరోసా కింద 12 వేలు తన ఖాతాలో జమ చేసినందుకు ముఖ్యమంత్రి గారికి, ఆర్థిక శాఖ మంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి, ప్రభుత్వానికి ఆనందంతో కృతజ్ఞతలు తెలిపారు,ఏటిగడ్డతండా రైతు వేదిక నుండి జరిగిన ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె వీరబ్రహ్మచారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఎం.విజయనిర్మల, జిల్లా హార్టికల్చర్ అధికారి జి.మరియన్న, ఏవో ఎన్.తిరుపతి రెడ్డి, ఆయిల్ ఫెడ్ మెంబర్ కృష్ణారెడ్డి, స్థానిక తహసిల్దార్ రాజేశ్వరరావు, రైతులు సత్తిరెడ్డి, రవి, బుచ్చిరెడ్డి, సిబ్బంది పూజిత, సాయి ప్రకాష్, రంజిత్ కుమార్, పాల్గొన్నారు.

# నిషేధిత నల్ల బెల్లం పట్టివేత

**తొవ్వ,నర్సింహులపేట, జూన్. 16**



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని నర్సింహ పురం (బంజర) గ్రామ పంచాయితీ పరిధిలోని లాలితండాలో ఒక ఇంట్లో ఉన్న నిషేధిత 2 బస్తాల నల్ల బెల్లం, 5 బస్తాల పటిక పట్టుకొని ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సబ్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్ మాలో త్ సురేష్ తెలిపారు. ఎవరైనా నిషేధిత నల్ల బెల్లం, మత్తు పదార్థాలను, విక్రాయించినా, అక్రమంగా రవాణా చేసిన కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146